క్లుప్తంగా

అభయప్రదాయినిగా దర్శనమిస్తున్న అమ్మవారు



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం శుక్రవారం కావడంతో అమ్మవారిని అభయ ప్రదాయినిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

భట్టిప్రోలు: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి జి.మీరయ్య శుక్రవారం రైతులకు సూచించారు. వరి కోతలు కోయని వారు వాతావరణాన్ని అనుసరించి, పరిస్థితులను బట్టి కోతలను నిలుపుదల చేయాలని తెలిపారు. సాధ్యమైనంత వరకు హార్వెస్టర్ ద్వారా ధాన్యాన్ని సేకరించి సురక్షిత ప్రదేశంలో పట్టాలు కప్పి భద్రపరచుకోవాలని సూచించారు.

ఖాజీపాలెంలో ఆడుదాం ఆంధ్రా పోటీలకు ఏర్పాట్లు



పిట్టలవానిపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం- ఆంధ్రా క్రీడా ఉత్సవానికి ఖాజీపాలెం సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం సిద్ధమవుతోంది. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాల ఎంపికైంది. శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు క్రీడా మైదానాన్ని పరిశీలించారు. క్రీడా మైదానాన్ని ట్రాక్టర్‌తో చదును చేయించారు. కార్యక్రమంలో ఖాజీపాలెం గ్రామ సర్పంచి కుంతం అనూష, పార్టీ నాయకులు ప్రసన్నరాజు, మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, నాయకులు గుమ్మడి సీతయ్య, కోమలి సర్పంచి శ్యామల నాగిరెడ్డి, కూసంపూడి దేవేంద్రరాజు, పీఈటీ కరిముల్లా పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం


సురేష్‌కుమార్


శ్రీనివాసరావు

భట్టిప్రోలు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) మండలం కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం స్థానిక యూటీఎఫ్ శాఖ కార్యాలయంలో జరిగింది. అధ్యక్షులుగా వి.సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా వీవీ ప్రతాప్, ఎం.కృష్ణప్రియ, గౌరవాధ్యక్షులుగా కె.వేగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం రేపల్లె మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ద్వితీయ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి కావస్తున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు హాజరవుతారని చెప్పారు.

సామూహిక కుంకుమ పూజలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత నరేంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో కుంకుమ పూజలో పాల్గొన్నారు. నిత్య కళ్యాణోత్సవాలలో భాగంగా గరికపాటి సాంబశివరావు దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం స్వామి వారికి పంచదారతో అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్ బాటలోనే మిగిలిన రాష్ట్రాలు

ఎమ్మెల్యే కోన రఘుపతి


గోకరాజునల్లిబోయినవారిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

గోకరాజునల్లిబోయినవారిపాలెం(పీవీ పాలెం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పక్క రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీలు అమలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి దబ్బుకూటి మాధవరావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేసిన చరిత్ర గతంలో ఏ నాయకుడికి లేదని చెప్పారు. సంక్షేమ పథకాలతో అక్కచెల్లెమ్మల జీవితాల్లో సంతోషం ఉండాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ బాజి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కత్తి కుమారి, సర్పంచులు, జేసీఎస్ కన్వీనర్ అల్లూరి సురేష్‌బాబు, బీసీ సెల్ మండల కన్వీనర్ ఎనుముల కోటేశ్వరరావు, యూత్ కన్వీనర్ గోపి, దేవేంద్రరాజు, కుంతం ప్రసన్నరాజు, కూసంపూడి దేవేంద్రరాజు, గుమ్మడి సీతయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక పురోగతి

కొల్లూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబాలు ఆర్థిక పురోగతి సాధిస్తున్నాయని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మురాల రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని పెసర్లంకలో 'వై ఏపీ నీడ్స్ జగన్' స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలను అందజేయడం ద్వారా ఎన్నికలకు ముందు చేసిన హామీలను నెరవేర్చిందని చెప్పారు. ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకునే రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతూ, రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని చెప్పారు. సచివాయలం పరిధిలోని పెసర్లంక, పెదలంక గ్రామాలలో రూ.24.84 కోట్ల సంక్షేమ పథకాల రూపంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెదలంక సర్పంచి గొల్లపూడి వెంకటసుబ్బారావు, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి షరీఫ్ పాల్గొన్నారు.


భట్టిప్రోలులో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు


పెసర్లంకలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు: పేద ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతూ భట్టిప్రోలులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీం, జిల్లా యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు ఇస్మాయిల్, వైఎస్సార్ సీపీ నాయకులు శిరందాసు మనోహర్ పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు

చావలి(వేమూరు): ప్రభుత్వం పథకాలు పార్టీలకు అతీతంగా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఎంపీపీ యల్లమాటి మోహన్ పేర్కొన్నారు. గ్రామ సచివాలయం – 2 పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అమలు తీరు, అందించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందరికి అందలాంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను ఎన్నుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బొల్లిముంత ఏడుకొండలు, దాది సుబ్బారావు, గాజుల భాను ప్రకాశ్, ఎంపీటీసీ ఎస్.జయలక్ష్మి పాల్గొన్నారు.


చావలి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎంపీపీ మోహన్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల లబ్ధి

ఏట్రవారిపాలెం(కర్లపాలెం): రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చుతోందని ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. ఏట్రవారిపాలెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సచివాలయంలోని వెల్ఫేర్ బోర్డు ఆవిష్కరించి సభలో మాట్లాడారు. అనంతరం కూరగాయల మార్కెట్ వద్ద వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, జేసీఎస్ కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చీరాల పద్మావతి, చీరాల సత్యనారాయణరెడ్డి, ఆసిఫ్ అలీ, పార్టీ నాయకులు అక్కల శ్రీనివాసరెడ్డి, ఎండీ అమీర్‌బేగ్, పి.కుమార్, కె.నాగరాజు, ఎం.అయ్యప్పరెడ్డి, జి.మీరయ్య, కత్తి దానియేలు, చిక్కాల సాగర్, సలగల ధర్మేంద్ర, మార్పు బెనర్జి, ఎం.శివరావు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కుంకుమ అభిషేకం

బాపట్ల అర్బన్: ఎస్ఎన్‌పీ అగ్రహారం గంగా పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తిక మాసం శుక్రవారం కుంకుమాభిషేకం జరిగింది. ఆలయ అర్చకులు కె.వెంకట శివ వర ప్రసాద్ ఆధ్వర్యంలో విశేష అలంకరణ చేశారు. స్వామివారు 'ఆరుద్రలింగేశ్వరుని'గా భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, దీపారాధనలు చేశారు.

కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం



భట్టిప్రోలు: బస్టాండ్ సెంటర్‌లోని అల్లూరు కాల్వ కట్టపై నివసిస్తున్న మహిళలకు వీఆర్వో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణతరగతులను పంచాయతీ వార్డు సభ్యురాలు గోలి సుధ ప్రారంభించారు. సంస్థ సర్కిల్ ప్రాజెక్ట్ మేనేజర్ డి. శౌరిరాజు మాట్లాడుతూ మూడు నెలల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోలి శ్రీనివాసరావు, వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రామ సచివాలయం ప్రారంభం

చంపాడు(వేమూరు): గ్రామంలో గ్రామ సచివాలయాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున హాజరవుతారని చెప్పారు.

రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో బాపట్ల నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నో ప్రభుత్వాలు మారాయని అయితే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన సంక్షేమాభివృద్ధి ఎన్నడూ జరగలేదని అన్నారు. నవరత్నాల పేరుతో అనేక కార్యక్రమాలను అందించిన ఘనత జగన్‌కే దక్కుతోందని కొనియాడారు. ప్రతిపక్షాలకు ఈ అభివృద్ధి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సంక్షేమానికి పెద్ద పీట వేసిన సంక్షేమ సారథి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. జనసేన, టీడీపీ పొత్తుగా పోటీ చేస్తామని ప్రకటించిన తర్వాత బాపట్ల నియోజకవర్గంలో నిర్వహించిన సర్వేలో బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతినే ఎన్నుకుందామని 67 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో బాపట్ల శాసన సభ్యునిగా 18 వేల మెజార్టీతో గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. పిట్టలవానిపాలెం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలని అనే కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, సర్పంచి శ్యామల నాగిరెడ్డి, పార్టీ నాయకులు కె.దేవేంద్రరావు, ప్రసన్నరాజు, ఎనుముల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను పరిరక్షించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్


సభలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

కర్లపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పరిరక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్ది భాగ్యశ్రీధర్ చెప్పారు. కర్లపాలెం పెద్దింటమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం ఏఐటీయూసీ మండల ప్రథమ మహా సభ నిర్వహించారు. శ్రీధర్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించుకునేందుకు హక్కులను సాధించుకునేందుకు ఏఐటీయూసీ ఆవిర్భవించిందని చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కార్మికులంతా ఐక్యంగా ఉన్నప్పుడే మన సమస్యలను మనమే పరిష్కరించుకోగలుగుతామని చెప్పారు.

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్ మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేస్తే ఊరుకునేది లేదని ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బాపట్ల నియోజక వర్గం అధ్యక్షుడు సన్నమూడి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె కరిముల్లా, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సింగరకొండ సీపీఐ సీనియర్ నాయకులు ఎం.వెంకటరావు, యారం బాబూరావు, కార్మికులు తదితరులు ఉన్నారు.

జనరల్ నాలెడ్జ్‌లో భాష్యం విద్యార్థుల ప్రతిభ

రేపల్లె రూరల్: వీవా ఎడ్యుకేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి జనరల్ నాలెడ్జ్ పోటీలలో పట్టణానికి చెందిన భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. నవంబర్ 14వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో నాషా సాహితి, కోవిద్, లాస్య, సాత్విక్ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన పోటీలలో నాషా సాహితి జట్టు ఉత్తమ ప్రదర్శన కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అభినందన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్ జోనల్ ఇన్‌ఛార్జి హృదయ్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసన్న, ఉపాధ్యాయులు వసుంధర పాల్గొన్నారు.



విద్యార్థినిని అభినందిస్తున్న భాష్యం స్కూల్ జోనల్ అధికారి హృదయ్‌రాజ్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



నగరం: గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గృహ నిర్మాణశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. నవరత్నాలు–పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మంజూరైన గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు కృషిచేయాలన్నారు. మండలంలో 618 గృహాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. గృహనిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, గృహనిర్మాణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సైదానాయక్, తహసీల్దార్ ప్రమీల, హౌసింగ్ డీఈ సుబ్బారావు, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ


రేపల్లె ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ మల్లికార్జునరావు, మునిసిపల్ కమిషనర్ విజయసారథి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రేపల్లె: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జునరావు కోరారు. నీ ఓటు- నీ భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ వద్ద ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని సూచించారు. కుల, మత, లింగ విభక్ష లేకుండా రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించిందని వివరించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని, ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించే, నిస్వార్థంగా పని చేసే నాయకుడి ఎన్నుకునేందుకు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు అవకాశం కలిగిస్తుందని చెప్పారు. ప్రజలను చైతన్యపరిచి ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా బూత్‌లెవల్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగిఉండాలి

నగరం: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.ప్రమీల చెప్పారు. ఎస్వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలో ఎస్వీఆర్ఎం కళాశాల విద్యార్థులతో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటుహక్కు అర్హులని పేర్కొన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో 2,3 తేదీలలో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం ఉందని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

రేపల్లె: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో ఉన్న విశ్వశాంతి హైస్కూలులో అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు జానం మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే దివ్యాంగులు తమతో పాటు సదరన్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, 4 పాస్‌ఫోటోలు తమతో తీసుకురావాలని కోరారు.

అల్లూరులో రేపు దివ్యాంగుల దినోత్సవం

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు గ్రామంలో ఈనెల 3వ తేదీన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు బుడేసాహెబ్ మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపకులు రెహమాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా అల్లూరు, పరిసర గ్రామాలకు చెందిన దివ్యాంగులు, అనాథలు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



రేపల్లె: ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.సుధాకరరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివప్రసాద్, అధ్యాపకులు కే.శ్రీనివాసరావు, శివరామిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో సమావేశ మందిరంలో వైద్యశాల సిబ్బందికి హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా సబ్‌కోర్టు జడ్జి వెంకటేశ్వర్లు న్యాయ సేవా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జగదీష్ పాల్గొన్నారు.

నిజాంపట్నం: ఎయిడ్స్‌వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ మురళీ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కూచినపూడి గ్రామంలో డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

బాపట్ల అర్బన్: స్థానిక మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ ప్రత్యేక ప్రదర్శనతో ఎయిడ్స్ వ్యాధిపై సమాజంలో గల అపోహ తొలగించేందుకు అవగాహన కలిగి ఉండాలని ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఐ.హరిత, ఎన్‌సీసీ అధికారిని ఓ శ్రీదేవి పాల్గొన్నారు.


వేమూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్లు, గ్రామ సచివాలయం కన్వీనర్లు -వేమూరు



• **ఠంచెన్‌గా పింఛన్లు**

బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంకలో ఎం.ఆంధ్రభారతి అనే లబ్ధిదారురాలికి వితంతు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు శివపార్వతి

-కొల్లూరు